క్లుప్తంగా

సీఎం జగన్‌ను కలిసిన నేతలు



సీఎం జగన్‌ను కలిసిన మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ సీతాదేవి, కృష్ణస్వరూప్

బుట్టాయగూడెం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మాజీ ఏఎంసీ చైర్‌పర్సన్ సీతాదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కరాటం కృష్ణ స్వరూప్ బుధవారం సీఎం క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. వచ్చే ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని సీఎం వైఎస్ జగన్ తెలిపినట్లు వారు చెప్పారు.

చండీహోమం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయంలో అమ్మవారి జన్మ నక్షత్రమైన మూలా నక్షత్రం పురస్కరించుకొని 11వ చండీ హోమం నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామమోహనరావు పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు శ్రీ సుదర్శనం వేణుగోపాలాచర్యులు, సత్య కిరణ్ పండితులు చండీహోమం జరిపారు. పలువురు దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. అలాగే మాస శివరాత్రి పురస్కరించుకొని శివపార్వతులకు పల్లకీ సేవ నిర్వహించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

జంగారెడ్డిగూడెం: మోడల్ అసోసియేషన్ ఆఫ్ దళిత్ ఎంప్లాయిస్ ఏపీ 'మేడ్' నూతన సంవత్సర 2024 క్యాలెండర్‌ను జంగారెడ్డిగుడెం ఆర్డీవో కె.అద్దయ్య చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ ఉద్యోగ సంఘాలు ప్రభుత్వ విధులు సక్రమంగా నిర్వర్తిస్తూ సంఘ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. సంఘ ఏలూరు జిల్లా అధ్యక్షుడు లాగు జయరాజు మాట్లాడుతు దళిత ఉద్యోగ హక్కుల సంరక్షణే ధ్యేయంగా సంఘం పనిచేస్తుందని అన్నారు. 'మేడ్' ఏలూరు జిల్లా నాయకులు కూనపోము రాజరత్నం, సూర్యారావు కొక్కిరపాటి మధు డోలా రాజరావు మిరియాల రవి పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

చింతలపూడి: క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక సామర్థ్యం పెరుగుతాయని జెడ్పీటీసీ ఎం నీరజ సుధాకర్, ఎంపీపీ డా.రాంబాబు నాయక్ అన్నారు. రాఘవాపురం హైస్కూల్ గ్రౌండ్‌లో కపిల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను గురువారం వారు ప్రారంభించారు. కపిల్ క్రికెట్ అసోసియేషన్ నిర్వాహకులతోపాటు మాజీ సొసైటీ చైర్మన్ గిరి భోగారావు, వైఎస్సార్ సీపీ నాయకులు సీహెచ్ శ్రీరామ్మూర్తి, సీహెచ్ కిషోర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న లబ్ధిదారులు

టి.నరసాపురం: కేతవరంలో గురువారం గ్రావెల్ తవ్వకాలను లబ్ధిదారులు అడ్డుకున్నారు. స్థానిక గ్రీన్ ఫీల్డ్ హైవే సంబంధిత వ్యక్తులు గ్రావెల్ తవ్వకాలను జరిపేందుకు పూనుకోవడంతో ప్రభుత్వం నుంచి భూమి పట్టాలు పొందిన లబ్ధిదారులు ఆందోళనకు దిగారు. 2017లో అప్పటి ప్రభుత్వం 113 మందికి 113 ఏకరాలు ఆర్‌ఎస్ నెంబర్ 1/1లో పట్టాలిచ్చింది. ఆ భూమికి సంబంధించి 106 మంది లబ్ధిదారులు కోర్టు నుంచి స్టేటస్‌కో పొందామని తెలిపారు. ఆ భూమిలో తాము సాగులో ఉండడంతో పాటు బ్యాంకుల్లో రుణాలు కూడా పొందామని, ప్రభుత్వ నుంచి రైతు భరోసా కూడా పొందామని లబ్ధిదారులు గంటా బుజ్జిబాబు, మరికొందరు లబ్ధిదారులు తెలిపారు. సంఘటనా స్థలానికి చేరుకున్న తహసీల్దార్ కార్యాలయ డీటీ రాధాకృష్ణ ఇరు వర్గాల వద్ద ఉన్న రికార్డులను పరిశీలించి ఉన్నతాధికారులు తదుపరి నిర్ణయం తీసుకునే వరకు తవ్వకాలను నిలిపివేయాలని సూచించారు. జేసీబీ మిషన్‌ను అక్కడి నుంచి పంపించి వేశారు.

ఉన్నత శిఖరాలే లక్ష్యం కావాలి



క్రీడాకారులతో సునీల్ కుమార్

చింతలపూడి: యువత ఉన్నత శిఖరాలను లక్ష్యంగా నిర్దేశించుకుని, లక్ష్యసాధనకు కృషి చేయాలని రాష్ట్ర ఫైర్ అండ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ డీజీపీ, ఇండియా మిషన్ (ఎయిమ్) వ్యవస్థాపకులు పీవీ సునీల్ కుమార్ అన్నారు. గురువారం చింతలపూడిలో సంక్రాంతి పండుగ సందర్భంగా అంబేద్కర్ ఇండియ మిషన్ (ఎయిమ్) ఆధ్వర్యంలో గ్రేస్ గార్డెన్‌లో మూడు రోజుల పాటు నిర్వహించనున్న వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని అన్నారు. పండగల పేరుతో జూద క్రీడల జోలికి పోవద్దని హితవు పలికారు. డా బాబా సాహెబ్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంతకుముందు నందమూరి విద్యానగర్ కాలనీలో డా అంబేడ్కర్ భవన నిర్మాణ పనులను పర్యవేక్షించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన దళిత ఉద్యమ నేత బండి ఆశీర్వాదం కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎయిమ్ జిల్లా అధ్యక్షుడు వాసే ఆనంద్, కార్యదర్శి పి.రాంబాబు, ,జిల్లా కోకన్వీనర్ గొంది రాజు, నాయకులు ఎస్ ఎస్ రాజేంద్ర, కాకర్ల సత్యన్నారాయణ, కె.బుచ్చిబాబు, ఆర్గనైజర్ రజనీ, కె.నాగేశ్వరరావు, పీఈటీలు వేణు, యూసుఫ్ పాల్గొన్నారు.

హోరాహోరీగా 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు



బుట్టాయగూడెం: జెడ్పీహైస్కూల్‌లో వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



బుట్టాయగూడెం: ఉత్సాహంగా కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

బుట్టాయగూడెం: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు రసవత్తరంగా సాగుతున్నాయి. ఈ పోటీల్లో భాగంగా గురువారం స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో వాలీబాల్, కబడ్డీ, కోకో, క్రికెట్, షటిల్ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఎంతో ఉత్సాహంగా పాల్గొని తమ జట్టు గెలుపుకోసం చివరివరకు పోరాడారు. ప్రధానంగా వాలీబాల్, కబడ్డీ పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఎంపీడీఓ ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తహసీల్దార్ ఎస్.శారాశాంతి, ఈఓపీఆర్డీ ఎం.శ్రీహరి, ఎంఈఓ తెల్లం బాబూరావు పర్యవేక్షణలో గిరిజన సంక్షేమ పాఠశాలలకు చెందిన పీఈటీలు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఈ ఆటలను నిర్వహిస్తున్నారు.

ఆడుదాం ఆంధ్ర చక్కటి వేదిక

చింతలపూడి: క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించాలని ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. గురువారం చింతలపూడి మండలంలో స్థానిక ప్రభుత్వ బాలుర హైస్కూల్ గ్రౌండ్‌లో, ప్రగడవరం జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో వాలీబాల్, కబడ్డీ, షటిల్ పోటీలు జరిగాయి. ఈ పోటీలను పరిశీలించిన ఎంపీడీవో మాట్లాడుతూ క్రీడలు ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని కలిగిస్తాయని తెలిపారు. క్రీడల్లో సత్తా చాటడానికి ఆడుదాం ఆంధ్ర చక్కటి వేదిక అని, గ్రామీణ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చదువుతోపాటు ఆటల్లో రాణించాలి

కామవరపుకోట: యువత చదువుతోపాటు ఆటల్లో రాణించాలని ఎంపీడీవో కంతేటి శ్రీదేవి అన్నారు. గురువారం ఆడుదాం ఆంధ్రలో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీదేవి మాట్లాడుతూ శారీరకంగా ధృఢంగా ఉంటేనే మానసికంగా ఉల్లాసంగా ఉంటారని, దానికి ఆటలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యంతో పాటు, యువత గ్రామీణ స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించడం శుభ పరిణామం అని అన్నారు. యువత ఆటల్లో పాల్గొని, ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు.

కొయ్యలగూడెం: ఆడుదాం ఆంధ్ర మండల స్థాయి పోటీల్లో భాగంగా గురువారం బాలుర హైస్కూల్లో క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను ఎంపీడీవో ఆర్.బేబీ శ్రీలక్ష్మి పరిచయం చేసుకొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామస్థాయి పోటీలు విజయవంతంగా ముగిశాయని మండల స్థాయి పోటీలను కూడా అధికారులు విజయవంతం చేయడంలో కీలకపాత్ర నిర్వహించాలన్నారు.



చింతలపూడి: హైస్కూల్ గ్రౌండ్‌లో రసవత్తరంగా కబడ్డీ పోటీలు



కామవరపుకోట: జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్రికెట్ పోటీల్లో పాల్గొన్న కొండగూడెం, కొత్తూరు జట్లు



కొయ్యలగూడెం: బాలుర హైస్కూల్లో క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఎంపీడీవో బేబీ శ్రీలక్ష్మి

ఎమ్మెల్యే దంపతులకు సత్కారం



ఎమ్మెల్యే బాలరాజు రాజ్యలక్ష్మి దంపతులను గజమాలతో సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

కొయ్యలగూడెం: ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులను సీతంపేట, నరసన్నపాలెం పంచాయతీలకు చెందిన నాయకులు గురువారం రాత్రి ఘనంగా సత్కరించి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. బయ్యనగూడెం పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు తోట జయబాబు, నరసన్నపాలెం, సీతంపేట వైఎస్సార్‌సీపీ నాయకులు తోటకూర శ్రీనివాసరావు, కర్రెడ్ల ధర్మరాజు ఆధ్వర్యంలో నాయకులు వెళ్లి పోలవరం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా నియమితులైన రాజ్యలక్ష్మికి అభినందనలు తెలిపారు. పంచాయతీల పరిధిలో నిర్వహించే సంక్రాంతి వేడుకలకు హాజరు కావాల్సిందిగా ఆహ్వానించారు.

దొరమామిడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి

బుట్టాయగూడెం: దొరమామిడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే తెల్లం బాలరాజు తెలిపారు. గురువారం రాత్రి దుద్దుకూరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యుత్ శాఖ అధికారులతో నియోజకవర్గంలోని లోఓల్టేజ్ సమస్యపై చర్చించారు. దొరమామిడిలో విద్యుత్ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు తక్షణ చర్యలు తీసుకోవాలని సీఎండీతో ఫోన్‌లో మాట్లాడారు. అలాగే నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చూడాలని విద్యుత్‌శాఖ డీఈ పి.రాధాకృష్ణను ఆదేశించారు. వచ్చే వేసవికాలంలో కరెంట్ సమస్యలు తలెత్తకుండా చూడాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగన్‌ను గెలిపించుకోవాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి
- జంగారెడ్డిగూడెంలో 'మన వార్డు, మన ఊరు' కార్యక్రమం



జంగారెడ్డిగూడెంలో మన వార్డు, మన ఊరు కార్యక్రమంలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: రాష్ట్రానికి సీఎంగా మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి అన్నారు. జంగారెడ్డిగూడెం 1వ సచివాలయం పరిధిలోని ఇంద్రజిత్తు నగర్ కాలనీలో మన వార్డు, మన ఊరు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుత రామయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ గతంలో ఏ ప్రభుత్వాలు అందించని సంక్షేమం, అభివృద్ధి సీఎం వైఎస్ జగన్ అందించారన్నారు. చిన్నారి నుంచి ముదుసలి వరకు అన్ని వర్గాల ప్రజలను కంటికి రెప్పలా చూసుకుంటూ ప్రజల సంక్షేమానికి, ఆర్థిక అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్ కృషిచేశారన్నారు. అమ్మ ఒడి మొదలుకుని, రైతు భరోసా, చేయూత, ఆరోగ్య సురక్ష, విద్య, వైద్య రంగాలు, ఆర్‌బీకే, పింఛన్లు ఇలా ఎన్నో బృహత్తర కార్యక్రమాలు ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా సరే ప్రజలకు అందించారన్నారు. అటువంటి పాలన ముమ్ముందు కొనసాగాలంటే జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి సీఎం చేయాలని కోరారు. అనంతరం ఇంద్రజిత్తు నగర్‌లో మౌలిక సదుపాయాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. అలాగే తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై ఆమె స్పందించి, తక్షణ పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వార్డు కౌన్సిలర్ ముప్పాని రమణ సత్యనారాయణ, పామర్రు నియోజకవర్గ పరిశీలకులు మండవల్లి విజయసారథి, ఉభయగోదావరి జిల్లా బూత్ కమిటీల రీజనల్ కోఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, జేసీఎస్ కన్వీనర్ చింత అనిల్‌కుమార్‌గౌడ్, కౌన్సిలర్లు అయినాల వెంకటరమణమూర్తి, ఉగ్గం దుర్గాప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు బత్తిన చిన్న, చిప్పాడ వెంకన్న, గెద్దాడ శీను, షేక్ అమీర్, పంది రాజా, తల్లాడ సంజయ్, పెసరగంటి త్రిమూర్తులు, జగదీష్, దోరేపల్లి విజయ్, ఏఈ సంధ్య, పదవ సచివాలయం సెక్రటరీ, వలంటరీలు పాల్గొన్నారు.

రెడ్డిగూడెంలో జాతీయపతాకం ఆవిష్కరణ



భారీ జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన సూర్యతేజ

బుట్టాయగూడెం: మండలంలోని శివారు గ్రామమైన రెడ్డిగూడెంలోని కమ్యూనిటీ హాల్ సమీపంలో ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఎం.సూర్యతేజ భారీ జాతీయ పతాకాన్ని గురువారం ఆవిష్కరించారు. అలాగే పూల గార్డెన్‌ను కూడా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజన కొండరెడ్డి గ్రామాల్లో భారీ జాతీయ పతాకాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కొండరెడ్డి గిరిజనుల అభివృద్ధికి ప్రత్యేక కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఐటీడీఏ ద్వారా అందించే సేవలను కొండరెడ్డి గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కొండరెడ్డి పిల్లలకు ఉన్నత విద్యను అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా పీఎం జన్‌మన్ పథకంలో కొండరెడ్డి గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇళ్లకు విద్యుత్ సౌకర్యం కల్పించడం, రహదారి నిర్మాణం, అంగన్‌వాడీ కేంద్రాలతోపాటు మల్టీ పర్పస్ కేంద్రాలు కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మొడియం రామతులసి, సర్పంచ్ కుంజా దుర్గమ్మ, ఏపీఓ పీవీఎస్ నాయుడు, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ కేవీఎస్ఎన్ కుమార్, డీఈ ఎం. శ్రీనివాస్, డీవైఈఓ నీలయ్య, వెలుగు ఏపీడీ నాగేశ్వరరావు, ఏఎంఓ శిరమయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు కపిలవాయి హరిసూర్యనారాయణ, రమణ, నాగు, తేనె రాజు, కొండరెడ్డి గిరిజనులు, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం కృషి

కామవరపుకోట: కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణకు సంబంధించి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని కాంట్రాక్టు లెక్చరర్ జాయింట్ యాక్షన్ కమిటీ సభ్యులు పి.వీరబాబు గురువారం ఓ ప్రకటన తెలిపారు. ఉన్నతస్థాయి అధికారులు డబ్బులు వసూలు చేస్తున్నారంటూ ఒక పత్రికలో వచ్చిన అసత్య ప్రచారాన్ని ఆయన తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. అందులో ఎలాంటి వాస్తవం లేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం కాంట్రాక్టు లెక్చరర్ల జీవితాల్లో వెలుగులు నింపాలని చూస్తుంటే, ఇష్టం లేని ప్రతిపక్షాలు ఎల్లో మీడియా ద్వారా తప్పుడు రాతలు రాస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు లెక్చరర్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ త్వరగా పూర్తిచేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

పోలవరం గెలుపును జగనన్నకు కానుకగా ఇస్తాం



దుద్దుకూరులో ఎమ్మెల్యే బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులకు అభినందనలు తెలుపుతున్న సర్పంచ్‌ల బృందం

బుట్టాయగూడెం: పోలవరం నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీని అఖండ విజయంతో గెలిపించి ఆ గెలుపును జగనన్నకు కానుకగా ఇస్తామని మన్య ప్రాంతంలోని సర్పంచ్‌లు అన్నారు. దుద్దుకూరులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తెల్లం రాజ్యలక్ష్మి దంపతులను గురువారం బుట్టాయగూడెం మండలంలోని సర్పంచ్‌ల బృందం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా మండల సర్పంచ్‌ల ఛాంబర్ అధ్యక్షుడు బన్నే బుచ్చిరాజు మాట్లాడుతూ తామంతా సమన్వయంతో పనిచేస్తూ రాబోయే ఎన్నికల్లో తెల్లం రాజ్యలక్ష్మిని అఖండ విజయంతో గెలిపించి ఆ గెలుపును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని అన్నారు. ఎవరెన్ని విమర్శలు చేసినా పోలవరం వైఎస్సార్‌సీపీ అడ్డా అని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు తెల్లం రాముడు, సరియం చల్లయ్య, మడకం రామలక్ష్మి, పెడకం విజయలక్ష్మి, తెల్లం వెంకాయమ్మ, తెల్లం వెంకటలక్ష్మి, ఉయికే బొజ్జి, కుంజా దుర్గ, రవ్వా నాగు, తెల్లం దుర్గారావుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు

జంగారెడ్డిగూడెం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలై జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ట్రైనీ డీఎస్పీ బి.విద్య తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పొగాకు బంటా పని చేసే ఎం.మరియదాసు ఈ నెల 11వ తేదీన తాడువాయి షుగర్ ఫ్యాక్టరీ వద్ద నడుచుకుంటూ వెళుతుండగా లారీ ఢీకొంది. ఈ ఘటనలో మరియదాసు రెండుకాళ్లు నజ్జుకాగా, జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారన్నారు. ఆసుపత్రి నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసినట్లు ట్రైనీ డీఎస్పీ తెలిపారు.

ఘనంగా సంక్రాంతి సంబరాలు



జంగారెడ్డిగూడెం: సీఎస్‌టీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



చింతలపూడి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో భోగి మంటల చుట్టూ విద్యార్థుల సందడి



పోలవరం రూరల్: గూటాల సచివాలయం వద్ద ముగ్గుల పోటీలను పరిశీలిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని శ్రీ చత్రపతి శివాజీ త్రి శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో స్వర్ణోత్సవాలను పురస్కరించుకుని జంగారెడ్డిగూడెం మెట్ట ప్రాంత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో గురువారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.ప్రసాద్‌బాబు అధ్యక్షతన కళాశాల సాంస్కృతిక విభాగం, ఉమెన్ ఎంపవర్మెంట్ విభాగము కలిసి నిర్వహించిన ఈ కార్యక్రమంలో భోగి మంటలు, భోగిపళ్ళు, విద్యార్థినులకు ముగ్గుల పోటీలు, సంప్రదాయ వస్త్ర అలంకరణ, మ్యూజికల్ చైర్స్ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. విజేతలకు మెట్ట ప్రాంత సేవా సమాఖ్య జెట్టి శైలజ బృందం బహుమతులు అందజేశారు.

చింతలపూడిలో...

చింతలపూడి: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం సంక్రాంతి సంబరాలను ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డా పి శ్రీనివాసరావు సంక్రాంతి పండుగ విశిష్టతను విద్యార్థులకు తెలియజేశారు. భోగి మంటలు, భోగి పళ్ళు, గాలిపటాలు, ముగ్గుల పోటీలు, మ్యూజికల్ చైర్స్, నృత్యాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఎన్‌జేకే నరేంద్ర కుమార్, అధ్యాపకులు పాల్గొన్నారు.

పోలవరం రూరల్: సంక్రాంతి సంబరాల్లో భాగంగా గూటాల సచివాలయం వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన మహిళలతో పాటు పాల్గొన్న వారందరికీ కూడా బహుమతులు అందజేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి బహుమతులు అందించారు. భోగిమంటలు వేసి పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు సుంకర అంజిబాబు, పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి, ఉప సర్పంచ్ కరిబండి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు



జంగారెడ్డిగూడెంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్పీ ధనుంజయుడు

జంగారెడ్డిగూడెం: సంక్రాంతి సంప్రదాయం పేరుతో ఎవరైనా కోడిపందేలు, జూదక్రీడలు నిర్వహించినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని జంగారెడ్డిగూడెం డీఎస్పీ ధనుంజయుడు హెచ్చరించారు. గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ హైకోర్టు ఉత్తర్వుల మేరకు పేకాట, కోడి పందేలకు ఏలూరు జిల్లాలో ఎక్కడా అనుమతులు లేవన్నారు. పండుగ మూడు రోజులు కూడా అనుమతులు లేవని ఉత్తర్వులు మీరి ఎవరైనా వీటిని నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. జంగారెడ్డిగూడెం సబ్‌డివిజన్ పరిధిలో జనవరి 1 నుంచి 9వ తేదీ వరకు మొత్తం 274 బైండోవర్ కేసులు నమోదు చేసి 523 మందిని తహసీల్దార్ కోర్టులో హాజరు పరిచినట్లు చెప్పారు. అలాగే డివిజన్ వ్యాప్తంగా 16 పేకాట కేసులు నమోదు చేసి 95 మందిని అరెస్టు చేశామని, వీరి నుంచి రూ.97,610 స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కోడి పందేలు నిర్వహిస్తున్న 8 కేసులలో 50 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.28,860, 12 కోడిపుంజులు, 9 కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామన్నారు. నాటుసారా తయారీ, అక్రమ రవాణాకు సంబంధించి 20 కేసులకుగాను 19 మందిపై కేసు నమోదు చేసి 127 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకోగా, డ్యూటీ లిక్కర్ కలిగి ఉన్న నేరంపై 13 మందిని అరెస్టు చేసి వారి నుంచి రూ.15,070 విలువైన 137 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ప్రజలు ఈ పండుగను కుటుంబసభ్యులతో సంతోషంగా నిర్వహించుకోవాలని, జూదక్రీడల వైపు పోవద్దని సూచించారు. ట్రైనీ డీఎస్పీ బి.విద్య, సీఐ పి.రాజేష్, ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామస్తులకు అవగాహన

కామవరపుకోట: గ్రామాల్లో ఎక్కడైనా కోడి పందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ డీవీ సత్యనారాయణ హెచ్చరించారు. గురువారం కొత్తూరులోని చెక్ పోస్ట్ సెంటర్, బస్టాండ్ సెంటర్, తడికలపూడి, పలు గ్రామాల్లో ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జూద క్రీడల జోలికి పోవద్దని హితవు పలికారు. 144 సెక్షన్ అమలులో ఉందని, ఎవరైనా ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే కేసు నమోదు చేస్తామని తెలిపారు.

పోలవరం రూరల్: కోడిపందేలు, గుండాట, పేకాట, జూదం వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించడం నిషేదమని, ఆజ్ఞలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బి.సుమతి హెచ్చరించారు. గూటాలలో నిర్వహించిన గ్రామ సభలో ఆయన మాట్లాడుతూ ఎక్కడైనా జూదక్రీడలు నిర్వహించినట్లే తెలిస్తే కేసులు నమోదు చేస్తామన్నారు. ఎస్సై ఎస్ఎస్ పవన్‌కుమార్, వీఆర్వో బి.నెహ్రూ, పంచాయతీ కార్యదర్శి టి.విజయకుమారి, కరిబండి శ్రీను తదితరులు పాల్గొన్నారు.